సాక్షి
కామారెడ్డి
శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



బస్సును ఢీకొన్న లారీ
యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.
- 8లో ▸



వాటరింగ్ డే నిర్వహించాలి
అధికారులు ప్రతి శుక్రవారం తప్పనిసరిగా వాటరింగ్ డే నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.6 /12.4
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సొసైటీ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారంతో సంఘాల పదవీ కాలం ముగియాల్సి ఉండగా ఆరు నెలలు పొడిగించింది. జిల్లాలో 55 సహకార సంఘాలున్నాయి. ఆయా సంఘాల పాలకవర్గాలు మరో ఆరునెలల పాటు కొనసాగనున్నాయి.

జిల్లా బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

గాంధారి: జిల్లా జూనియర్ బాలబాలికల జట్లను శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక చేశారు. ఈ విషయాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగా వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఎంపిక పోటీలకు 65 మంది బాలురు, 50 మంది బాలికలు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 14 మంది బాలురు, 14 మంది బాలికలను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఈనెల 20 నుంచి వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న విక్టర్

కామారెడ్డి క్రైం: ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వవద్దన్నారు. శిక్షణలో జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రమేశ్

కామారెడ్డి అర్బన్: తెలంగాణ వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కుసుమ రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, ప్రధాన కార్యదర్శి రాజేష్ ఖన్నా తనకు నియామక పత్రం అందించారని రమేశ్ తెలిపారు.

వైభవంగా నిర్వహించాలి

నిజామాబాద్ రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ఆలయాల సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఆలయాల కార్యనిర్వహణ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.



సహకారం చేరువయ్యేదెప్పుడో?

- జిల్లాలో 55 పీఏసీఎస్‌లు
- మరో 26 సంఘాలు ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదనలు

ఎల్లారెడ్డి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు పుష్కర కాలంగా విస్తరణకు నోచుకోవడం లేదు. సొసైటీల సంఖ్యను పెంచేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపినా వాటికి ఆమోదం లభించలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు.

వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడి రుణాలు, ఎరువులు, విత్తనాలతో పాటు మరిన్ని సేవలు అందించడంలో సహకార సంఘాలు ముందున్నాయి. అయితే చాలా గ్రామాల రైతులకు అందుబాటులో సొసైటీలు లేకపోవడం కొంత ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో గతంలో కేంద్ర ప్రభుత్వం సంఘాల పునర్విభజనకు చర్యలు చేపట్టింది. రెండు వేల మంది సభ్యులకు ఒక సొసైటీ ఉండేలా చూడడంతోపాటు రెండు గ్రామాలకు ఒకటి చొప్పున గాని, కనీసం ప్రతి మండలానికి రెండేసి చొప్పున గాని సహకార సంఘాలు ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై కసరత్తు చేసిన సహకార అధికారులు.. జిల్లాలో కొత్తగా 26 సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు.

55 సొసైటీల్లో 1.4 లక్షల మంది..

జిల్లాలో ప్రస్తుతం 55 సొసైటీలున్నాయి. వాటి పరిధిలో 1,40,947 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అడ్లూర్ ఎల్లారెడ్డి సహకార సంఘంలో అత్యధికంగా 6,481మంది సభ్యులున్నారు. భిక్కనూర్ మండలంలోని అంతంపల్లి సొసైటీ 743 మంది సభ్యులతో తక్కువ సభ్యులు గల సొసైటీగా ఉంది. మాచారెడ్డిలో 5,776 మంది, మాల్తుమ్మెదలో 4,897 మంది, కామారెడ్డిలో 4,862 మంది, పద్మాజీవాడిలో 3,966 మంది, లింగంపేటలో 3,826 మంది, ఎల్లారెడ్డి సొసైటీలో 3,745మంది సభ్యులుగా ఉన్నారు. మిగతా సొసైటీలలో 2 వేలనుంచి 3 వేల మంది వరకు రైతులున్నారు. కొత్త సొసైటీల ఏర్పాటులో జాప్యం జరుగుతుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. సొసైటీల విభజనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సొసైటీలను పెంచాలి

సహకార సంఘాల సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం రెండు వేల మందికి ఒక సొసైటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇది ఆహ్వానించదగ్గ నిర్ణయం. పెరిగిన సాగుభూమికి అనుగుణంగా సొసైటీలను పునర్విభజించాల్సిన అవసరం ఉంది.
– నర్సింలు, ఎల్లారెడ్డి సొసైటీ అధ్యక్షుడు

నివేదిక పంపించాం

కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్వేలు చేశాం. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులనూ పరిశీలించాం. జిల్లాలో కొత్తగా 26 సంఘాలు ఏర్పాటు చేయవచ్చని ప్రభుత్వానికి నివేదించాం. – రామ్మోహన్, జిల్లా సహకార అధికారి

కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధం

- ప్రజల దృష్టిని మరల్చడానికే కులగణన
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



మాట్లాడుతున్న లక్ష్మణ్, పక్కన ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి టౌన్: రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూపీఏ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైల్వేకు రూ. 800 కోట్ల బడ్జెట్ మాత్రమే కేటాయించారన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తమ ప్రభుత్వం ఏపీకి రూ. 9,500 కోట్లు, తెలంగాణకు 5,700 కోట్లు ఇచ్చిందని, 60 రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇందిరాగాంధీని గెలిపించినా మెదక్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. మోదీ ప్రధాని అయ్యాకే మెదక్‌లో రైల్వే స్టేషన్ నిర్మించారన్నారు.

నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని లక్ష్మణ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చెల్లని రూపాయి వంటివని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని తెలియక హామీలిచ్చామని, గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు నిలదీస్తున్నారని కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు బాహాటంగా చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించడానికి హైడ్రా, కులగణన, మూసి నది ప్రక్షాళన పేరిట నాటకాలు ఆడుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు పైడి ఎల్లారెడ్డి, రంజిత్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను బిడ్డల్లా చూసుకోవాలి



చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- లైంగిక దాడులకు గురికాకుండా చూడాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: విద్యార్థులను ఉపాధ్యాయులు సొంత బిడ్డల్లా చూసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమితులైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోక్సోతోపాటు వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా ప్రతి పాఠశాలలో ఒకరిని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌గా నియమించామన్నారు. పాఠశాలల్లో ఎవరూ లైంగిక దాడులకు గురికాకుండా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు చూడాలన్నారు. కంప్యూటర్ ల్యాబ్, వరండాలతోపాటు అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి వివరించాలన్నారు. వేధింపుల సంఘటనలు ఎదురైనప్పుడు నిర్భయంగా ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు బ్యాడ్జ్‌లను అందించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ స్వర్ణలత, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, యునిసెఫ్ రిసోర్స్ పర్సన్ డేవిడ్ రాజ్, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసీసీబీ పదవీకాలం పొడిగింపు

- ఆరు నెలలపాటు ఎక్స్‌టెన్షన్
- ఉత్తర్వులందుకున్న చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి



సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత జీవో నం .74ను విడుదల చేసినట్లు డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును టెస్కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్లు కలిశారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ సంఘాల బలోపేతానికి మరింత కృషి చేస్తామని రమేశ్‌రెడ్డి చెప్పారు.

బాల్య వివాహం అడ్డగింత

బోధన్‌రూరల్: మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన ఓ యువకుడికి మహారాష్ట్రకు చెందిన బాలికతో బాల్య వివాహం చేసేందుకు యత్నించగా శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. 18 ఏళ్ల నిండకుండా బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం అధికారులకు అందింది. దీంతో వారు శుక్రవారం కల్దుర్కి గ్రామానికి చేరుకుని యువకుడి కుటుంబసభ్యులతో మాట్లాడి, వివాహాన్ని నిలిపివేశారు. అనంతరం సదరు బాలికను జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

ధర్పల్లి: ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జంతు, గణిత శాస్త్రంలో జిజ్ఞాసకు సమర్పించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రాజెక్టు అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, నిహారిక, జిజ్ఞాస ప్రాజెక్టు సమన్వయకర్త రవిరాజును ప్రిన్సిపాల్ అభినందించారు.

ఆటో ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి చౌరస్తాలో ఆటో ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. అర్సపల్లి చౌరస్తాలో షేక్ కరీం(45) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా అతడిని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటరింగ్ డే నిర్వహించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మొక్కలకు నీళ్లు పోస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అధికారులు ప్రతి శుక్రవారం తప్పనిసరిగా వాటరింగ్ డే నిర్వహించాలని కలెక్టర్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన కళాభారతి ఆడిటోరియం ఎదురుగా ఉన్న మొక్కలకు నీళ్లు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మొక్కలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని పార్కులు, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు నీళ్లు పట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పార్క్‌లను అభివృద్ధి చేయాలి

పట్టణంలో పార్క్‌లను అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి సీనియర్ సిటిజన్లు, ఆయా వార్డుల్లోని వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారం తీసుకోవాలని సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీలోగల పార్క్‌ను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలు ఆడుకునేందుకు పరికరాలు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పార్క్‌లలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. శానిటేషన్ పనులు, వాటరింగ్, పార్కుల అభివృద్ధి పనుల వివరాలను రోజు వారీగా సమర్పించాలని ఆదేశించారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వేసవిలో ఎండల కారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జాతీయ వాతావరణ మార్పులు –ఆరోగ్య సమస్యల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శిరీష, వ్యాధి నిరోధక టీకాల అధికారి విద్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుదయాకిరణ్, డీపీఆర్వో భీంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పాముల కలకలం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పగిలిన టైల్స్



కార్యాలయంలోకి వచ్చిన కట్ల పాము (ఫైల్)

- పగిలిన టైల్స్ మధ్యలోంచి వస్తున్న పాములు
- ఇబ్బందులు పడుతున్న జనాలు

ఎల్లారెడ్డి: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తరచూ పాములు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలోని టైల్స్ పగిలిపోవడంతో వాటి మధ్యలోంచి పాములు వచ్చి జనాలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వారు వాపోతున్నారు. కార్యాలయం కట్టిన ఏడాదికే టైల్స్ పగిలిపోవడంతో ఒకవైపు వాటిపై నుంచి నడవడానికి ప్రజలు ఇబ్బంది పడుతుంటే, మరోవైపు ఏ సందులో నుంచి ఏ పాము వస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి టైల్స్‌కు మరమ్మతులు చేసి, పాములు రాకుండా చర్యలు చేపట్టాలని జనాలు కోరుతున్నారు.

నిధులు రాగానే మరమ్మతులు

ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో టైల్స్ పగిలిపోవడంతో ఇబ్బందిగా ఉంది. వీటి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు రూ.4 లక్షల ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

– సురేందర్‌బాబు, సబ్ రిజిస్ట్రార్, ఎల్లారెడ్డి

రక్తదాన శిబిరానికి కాంగ్రెస్ నాయకులు తరలిరావాలి

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పుట్టిన రోజు సందర్భంగా శనివారం(నేడు) కామారెడ్డి సిరిసిల్లరోడ్డులోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం నిర్వహించే రక్తదాన శిబిరానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. రక్తం చేసిన ప్రతి ఒక్కరికి హెల్మెట్ బహుమతిగా అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. అలాగే రక్తదాన శిబిరానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కళా ప్రదర్శన

మాచారెడ్డి: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు మూఢనమ్మకాలపై శుక్రవారం మండల కేంద్రంలో కళా ప్రదర్శన నిర్వహించారు. మిమిక్రీ కళాకారుడు సుధాకర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నిర్వహించిన ప్రదర్శన అందరిని అలరించింది. అలాగే డ్రగ్స్‌కు అలవాటు పడ్డ యువకులు ఎలా మారిపోతారో మిమిక్రీ ద్వారా వివరించారు. ఎస్సై అనిల్ ఉన్నారు.

పెళ్లి మెనూలో చికెన్ బంద్

- వైరస్‌లతో కోళ్లు మృతి చెందడమే కారణం
- మటన్ పెట్టడానికే ప్రాధాన్యత



చికెన్ కొనేవారు లేక ఖాళీగా ఉన్న వ్యాపారి హోటీ

రామారెడ్డి: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. ఈ నెల 23 వరకు శుభ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లి భోజనాలపై కోళ్ల మృత్యువాత ప్రభావం పడింది. ఎక్కువగా పెళ్లిళ్లలో మాంసాహారంతో భోజనం పెట్టడం సర్వసాధారణం. ఇందులో మొదటి ప్రాధాన్యతగా మటన్, తర్వాత చికెన్, చేపలు, గుడ్లతో విందు భోజనాలు కొనసాగుతాయి. వేల సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో పెళ్లి విందు మెనూలో చికెన్ తొలగించేస్తున్నారు. దీంతో మటన్‌కు ప్రాధాన్యత భారీగా పెరిగింది. మరోవైపు మటన్ రేటు కూడా కిలో రూ.800 వరకు పలుకుతుండడంతో పెళ్లిళ్లు చేసే వారిపై ఆర్థిక భారం మరింతగా పెరిగింది. గతంలోనైతే మటన్ వడ్డించిన తర్వాత చికెన్ వడ్డించేవారు. ఇప్పుడు రెండు సార్లు కూడా మటన్ పెట్టడంతో శుభకార్యాల విందులు భారంగా మారాయి. అయితే కొంతమంది పెళ్లిళ్లలో చికెన్ పెడుతున్నప్పటికీ తినడానికి చాలా మంది ఇష్టపడటం లేదని తెలుస్తోంది.

ధర తగ్గించినా కొనడం లేదు



ఈ రోజు కిలో రూ.180 ధర ఉంది. కిలో రూ.150కి అమ్ముతున్నా కొనడం లేదు. గతంలో రోజూ 50 కిలోల చికెన్ అమ్మేవాడిని. ప్రస్తుతం కిలో కూడా అమ్మడం లేదు.

– షేక్ హోలీ, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, రామారెడ్డి

వేడిలో వైరస్ చనిపోతుంది



120 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు వేడి చేసుకుని చికెన్ వండితే అందులో ఉన్న వైరస్ చనిపోతుంది. చాలామంది చికెన్ 20 నిమిషాల్లో వండేస్తారు. 45 నిమిషాల పాటు వండాలి. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూతో కోళ్లు చనిపోయిన దాఖలాలు కూడా లేవు. ఎక్కువసేపు వేడి చేయడం వల్ల ఇబ్బంది ఉండదు.

– సురేశ్, రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి

అథ్లెటిక్స్‌లో మెరిసిన విద్యార్థిని

మాచారెడ్డి: జిల్లా స్థాయి 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిని శుక్రవారం అధ్యాపకులు అభినందించారు. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన తగిరంచ శ్రావ్య, మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల క్రీడల ఇన్‌ఛార్జి నర్సింలు తెలిపారు. ప్రిన్సిపాల్ యాఖినొద్దీన్, అధ్యాపకులు శ్రావ్యను అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మాచారెడ్డి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాలలో రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు ఒక్కో సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు ఒక్కో రోజు తరగతులు నిర్వహించాలని ఆదేశించినట్లు హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'మెరుగైన వైద్యసేవలందించాలి'



నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న అధికారి పద్మజ

నాగిరెడ్డిపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మజ సూచించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్)లతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లోని పల్లె దవాఖానాకు వచ్చే ప్రజలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ద్వారా లభించే సేవల గురించి తెలియజేయాలన్నారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్, సూపర్‌వైజర్లు సునంద, మణెమ్మ, డీఈవో బాలకృష్ణ, ఫార్మసిస్ట్ జయశ్రీ, ల్యాబ్‌టెక్నీషియన్ హరి, స్టాఫ్‌నర్స్ మానస, మేల్‌వర్కర్ మురళీకృష్ణ, ఎంఎల్‌పీహెచ్‌ఈలు అజయ్, దేవిదాస్, లావణ్య, అపర్ణ, జ్యోతి, రాశి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ఎనిమిది మందికి గాయాలు



లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

కామారెడ్డి క్రైం: యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును వెనకనుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. టేక్రియాల్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రయాణికులతో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో కామారెడ్డికి వస్తోంది. టేక్రియాల్ బైపాస్ సమీపంలో బస్సు బ్రిడ్జి నుంచి సర్వీస్ రోడ్డువైపు రావడానికి యూటర్న్ తీసుకుంటుండగా వెనకనుంచి వేగంగా వచ్చిన రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో సహా 8 మందికి గాయాలయ్యాయి. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై రాజు తెలిపారు.

క్రైం కార్నర్

కోటగిరి జీపీ కార్యదర్శికి ఏడాది జైలు

ఖలీల్‌వాడి/రుద్రూర్: లంచం తీసుకున్న కేసులో కోటగిరి జీపీ కార్యదర్శి జీఎం సుదర్శన్‌కు శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ ఏడాది కఠిన జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధించినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. కోటగిరికి చెందిన వడ్డే నర్సింహులు తన తండ్రి లింగయ్య పేరు మీద ఉన్న ఇళ్లను అతడి సోదరుడి పేరు మీద బదిలీ చేయాలని గ్రామ కార్యదర్శి సుదర్శన్‌కు 2014లో విన్నవించాడు. కానీ అతడు రూ. 10వేలు లంచం డిమాండ్ చేయగా, నర్సింహులు రూ.8వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని నర్సింహులు ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించాడు. ఈక్రమంలో ఫిబ్రవరి 21, 2024న సెక్రటరీ సుదర్శన్‌కు రూ.8వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మనోజ్ఞ వాదనలు వినిపించగా, ఇరువర్గాల వాదనలు విన్న నాంపల్లి ఏసీబీ కోర్టు జడ్జి ఏడాది కఠిన జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని యెడల ఒకనెల అదనపు సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెల్లడించినారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఒకరికి రెండురోజుల జైలు

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలుశిక్ష పడ్డట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. ఇటీవల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో 13మంది పట్టుబడగా ట్రాఫిక్ ఎస్సై చంద్రమోహన్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 12మందికి రూ.17వేలు జరిమానా విధించగా, ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన దాసరి మమత అనే గృహిణి అదృశ్యమైనట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఇసాయిపేటలో ఆమె కామారెడ్డి వైపునకు వెళ్లే బస్సు ఎక్కి వెళ్లగా, ఇప్పటికీ ఇంటికి తిరిగిరాలేదు. దీంతో భర్త మహిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

'అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు'

ఖలీల్‌వాడి: జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సిహెచ్ సింధుశర్మ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జనవరి, ఫిబ్రవరి నెలలో ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై 31కేసులు, నిజామాబాద్ డివిజన్‌లో 13కేసులు, ఆర్మూర్ డివిజన్‌లో 13కేసులు, బోధన్ డివిజన్‌లో 5కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 08462–226090, డయల్ 100కు ఫోన్ చేసి, సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఒకరిపై కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై మొగులయ్య తెలిపిన వివరాలు ఇలా.. ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన బాబు కూలీ పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. ఈనెల 12న రాత్రి అతడు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో నిద్రిస్తున్న సమయంలో పక్కన మరో యువకుడు వచ్చి పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అతడు బాబు జేబులో నుంచి డబ్బులు తీస్తుండగా, మెలుకువ వచ్చి, రైల్వే పోలీసులకు తెలిపాడు. వారు సదరు యువకుడిని అక్కడి నుంచి పంపించారు. కొంతసేపు తర్వాత మళ్లీ అతడు బాబు వద్దకు వచ్చి, కత్తితో దాడి చేశారు. వెంటనే స్థానికులు గాయపడిన బాబును జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స అనంతరం శుక్రవారం అతడు డిశ్చార్జ్ అయ్యాడు. ఈ కేసును ఒకటో టౌన్ పోలీసులు రైల్వే పోలీసులకు ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు.

'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడొద్దు'

నిజామాబాద్‌నాగారం: తెలంగాణలోని హిందువుల మధ్య సీఎం కుట్రలు పన్నుతున్నాడని, ఎవరూ కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడొద్దని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన అశాస్త్రీయమన్నారు. 1994లో గుజరాత్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉందని, రాష్ట్రంలో మోదీ కులాన్ని బీసీ జాబితాలో కలిపారని గుర్తు చేశారు. తర్వాత కొన్నేళ్లకు దేశంలో అమలు చేశారన్నారు. హిందువులను విడదీసే ఈ కుట్రలో పడొద్దని, యువకులు, బీజేపీ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీజేపీని అధికారంలోకి తెచ్చి హిందు రాష్ట్రం, హిందు దేశంగా మార్చడానికి కృషి చేయాలన్నారు. ఐక్యంగా ఉంటే మనల్ని ఎవరు ఏమీ చేయలేరన్నారు.

జిల్లాకు రెండు అవార్డులు

సుభాష్‌నగర్: టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీ ఐ ఎన్‌టీయూసీ–327 యూనియన్ 2024 సంవత్సరానికిగాను జిల్లాకు చెందిన జిల్లా అధ్యక్షుడు కనకమేడల వేణుగోపాల్‌రావు, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా రీజినల్ కార్యదర్శి పూదరి గంగాధర్‌కు బెస్ట్ లీడర్ అవార్డు, బెస్ట్ ఫైనాన్షియల్ సపోర్ట్ అవార్డులు వరించాయి. హైదరాబాద్‌లో శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆలిండియా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సంజీవ్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అవార్డులు అందించారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్టు



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరి నుంచి 400 గ్రాములు, వారికి అమ్మిన మరో ఇద్దరి వ్యక్తుల నుంచి 500 గ్రాములు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. వారిని అరెస్టు చేసి, వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం నిర్మల్, ఆదిలాబాద్ నుంచి ఎండు గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి హైవే 44పై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. టీవీఎస్ స్పోర్ట్స్ బైక్ టీజీ 18, 1151పై గంజాయిని తరలిస్తున్న జాదవ్ వంశీకృష్ణ, ఆకోజి అభిలాష్ పట్టుకుని 400 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా గంజాయి అమ్మిన తుకారాం రాథోడ్, తాళ్ల ప్రమోద్‌ను పట్టుకొని, వారి నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రతిభ చూపిన డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై షరీఫ్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులో శుక్రవారం ఒమ్ని వ్యాన్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న ఎవరికీ కూడా గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముప్కాల్ మండల కేంద్రం నుంచి ప్రయాణికులతో వస్తున్న ఒమ్ని వాహనం కొత్తపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి లక్ష్మికాలువ పక్కన గల చెట్టుకు ఢీకొంది. చెట్టు లేకుంటే నేరుగా వాహనం కాలువలో పడిపోయేదని, దీంతో పెద్ద ప్రమాదం సంభవించేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



దగ్ధమైన పెంకుటిల్లు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ముద్రకోలు స్వరూపకు చెందిన పెంకుటిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం అయింది. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి వారు బయటకు వెళ్లగా, కొద్దిసేపటికి ఇంట్లో నుంచి పొగలు రావడంతోపాటు మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి ఎల్లారెడ్డి అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే ఇంట్లో ఉన్న రూ. 1.5లక్షల నగదుతోపాటు రెండున్నర తులాల బంగారు అభరణాలు, విలువైన బట్టలు, వంటసామగ్రి కాలిపోయాయి.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కామారెడ్డి క్రైం: పట్టణంలోని కాకతీయనగర్ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే జ్ఞానబాయి ప్రయివేటు టీచర్‌గా పని చేస్తున్నారు. గురువారం ఆమె ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి స్వగ్రామమైన గాంధారి మండలం కరక్వాడికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. ఇంట్లోని బీరువాలో దాచిన 10 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు.

వర్క్ ఫ్రం హోం పేరిట సైబర్ మోసం

రెంజల్/నవీపేట: నవీపేట మండలకేంద్రంలో నివాసం ఉండే ఓ మహిళ వద్ద నుంచి వర్క్‌ఫ్రంహోం పేరిట సైబర్ మోసగాళ్లు సుమారు రూ.2లక్షలను కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా గనపవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి జ్యోతి రెండేళ్లుగా నవీపేట్ మండల కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో భర్తతో కలిసి నివసిస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆమె ఏదోఒక పని చేద్దామనుకుని ఆలోచించేది. ఈక్రమంలో ఇటీవల తన సెల్‌ఫోన్ ఇన్‌స్టాగ్రాంలో వర్క్ ఫ్రం హోం ప్రకటన చూసి, వారు పంపిన లింక్‌కు రూ. వెయ్యి పంపింది. అదేరోజు మహిళ అకౌంట్‌కు రూ. 1300 ప్రాఫిట్ వచ్చిందని పంపారు. అలాగే 2, 3 తేదీల్లో వారు సూచించిన విధంగా రూ. 2లక్షల 35వేల వరకు పంపారు. ఇంకా డబ్బులు పంపమని చెప్పడంతో అనుమానం వచ్చి మోసపోయినట్లు గ్రహించింది. వెంటనే సైబర్‌క్రైం నంబర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం నవీపేట్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.